ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

అభివృద్ధికి ఆమడదూరం

- దశాబ్దాలుగా మారని గిరిజనుల జీవనం - ఉపాధి అవకాశాలకూ నోచని వైనం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/విలేకరులు

వారంతా అభివృద్ధికి ఆమడదూరంలో జీవిస్తున్నారు. దశాబ్దాలుగా గిరిజనుల బతుకులు మారడం లేదు. ప్రభుత్వాలు మారినా వారిని ఎవరూ పట్టించుకోకపోవడంతో వారి జీవన స్థితిగతులు మారడం లేదు. శుక్రవారం పాణ్యం మండలంలో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ పర్యటించనున్నారు. గిరిజనులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో గిరిజనుల పరిస్థితిపై కథనం....

దట్టమైన నల్లమల్ల అడవుల్లో జీవిస్తున్న గిరిజనులకు అభివృద్ధి అందని ద్రాక్షలా ఉంది. నేటికీ ఉండేందుకు గృహాలు లేక రోడ్ల మీదే జీవనం గడుపుతున్నారు. గిరిపుత్రులు కొన్ని సంవత్సరాల క్రితం నుండి అడవికి వెళ్ళి బంక, తేనె కొన్ని రకాల అడవి పండ్లను తెచ్చి అమ్ముకుంటూ జీవనం సాగించేవారు. ప్రస్తుతం అటవీశాఖ అధికారులు, సిబ్బంది గిరిజనులను అడవిలోనికి వెళ్లకుండా అపుతున్న పరిస్థితిలో వారి జీవనం ప్రశ్నార్థకం గా మారింది. **కొత్తపల్లి** మండలంలో 10 చెంచుగూడేలు ఉన్నాయి. వాటిలో 1,621 మంది జీవిస్తున్నారు. కొత్తపల్లి మండలంలో పలు చెంచుగూడెంలలో ఉన్న చెంచు గిరిజనులకు ఆధార్ కార్డులు లేక ఆధార్ కార్డులు ఉన్న వారికి వేలి గుర్తులు పడక చాలామంది నేటికీ ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు. ప్రభుత్వం నుంచి నెలనెలకు అందాల్సిన రేషన్ సరుకులు కూడా సరిగ్గా రాక అర్ధాకలితో జీవిస్తున్నారు. **మహానంది** మండలంలో గిరిపుత్రుల కుటుంబాలకు ప్రభుత్వం నుండి ఉపాధి అవకాశాలు దొరక్క అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం నుండి వచ్చే పథకాలు కూడా సక్రమంగా అందడం లేదు. ప్రభుత్వాలు గిరిపుత్రుల జీవనోపాధి కోసం కొన్ని కోట్ల రూపాయలు బడ్జెట్లో పెడుతున్నా వారి జీవితాలు మాత్రం ఏ మాత్రం మారడం లేదు. మండలంలోని అబ్బీపురంలో 42 చెంచు కుటుంబాలు ఉన్నాయి. వారు ఎన్ని సార్లు అధికారులను కలిసినా మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడం లేదు. చెంచులక్ష్మి గూడెంలో 60 కుటుంబాలు ఉండగా 35 కుటుంబాలకు ప్రభుత్వం వ్యవసాయ భూమిని పంచింది. మిగిలిన వారి పరిస్థితి అలానే ఉండిపోయింది. 35 గిరిజన కుటుంబాలున్న ఆంజనేయపురంలోనూ మౌలిక సదుపాయాలు లేవు. విద్య, వైద్యం కూడా గిరిజనులకు అందడం లేదు. **బండి ఆత్మకూరు** మండలంలోని చెంచు గిరిజన గూడెంలోనూ గిరిజనులు అభివృద్ధికి దూరంగానే ఉన్నారు. మండలంలో నారపరెడ్డి కుంట చెంచుగూడెంలో 270 మంది, నిమ్మలకుంటలో 95 మంది, జనాబానాయిని చెరువులో 45 మంది, సోమయ్య గ్రామంలో 27 మంది చెంచు గిరిజనులు ఉన్నాయి. ఆర్‌డిటి స్వచ్ఛంద సంస్థ ద్వారా కొందరికి పక్క గృహాలు నిర్మించారు. ప్రభుత్వ అధికారులు మాత్రం చెంచులను అభివృద్ధి చేసేందుకు, వారిని జనజీవన స్రవంతిలో కలిపేందుకు చర్యలు తీసుకోవడం లేదు. వ్యవసాయ భూములున్నా వ్యవసాయ విధానాలపై శిక్షణ కూడా ఇవ్వడం లేదు. అడవికి వెళ్లి జీవనోపాధి పొందుదామంటే అడవి అధికారులు అడవి ఉత్పత్తులను సేకరించేందుకు అడవికి వెళ్లకుండా ఆంక్షలు విధిస్తున్నారని గూడేల ప్రజలు చెబుతున్నారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా తమ అభివృద్ధికి కృషి చేయాలని, ప్రభుత్వం వ్యక్తిగత రుణాలు ఇచ్చి తమకు ఉపాధి కల్పించాలని, మహిళలకు చేతివృత్తుల్లో శిక్షణ ఇవ్వాలని కోరుతున్నారు.

మహానంది : అబ్బీపురంలో పాకల్లోనే గిరిజనుల నివాసం

నేడు గవర్నర్ పర్యటన

గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్ శుక్రవారం పాణ్యం మండలంలో పర్యటించనున్నారు. బలపనూరు వద్దనున్న గిరిజన ఆశ్రమ పాఠశాలలో గిరిజనులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. ప్రత్యేక ఎయిర్‌క్రాఫ్ట్‌లో గన్నవరం విమానాశ్రయం నుంచి ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా బలపనూరుకు చేరుకోనున్నారు. అక్కడ గిరిజనులతో మాట్లాడి అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా నంద్యాల ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌కు వెళ్లనున్నారు. నంద్యాల నుంచి రోడ్డు మార్గం ద్వారా ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి ప్రత్యేక ఎయిర్‌క్రాఫ్ట్‌లో బెంగళూరుకు పయనం కానున్నారు.

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా

పటిష్ట బందోబస్తు

- గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి - ప్రవేశానికి హాల్ టికెట్, ఒరిజినల్ గుర్తింపు కార్డు తప్పనిసరి
- కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు - ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

ఎపి పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాత పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పటిష్ట భద్రత చర్యలు చేపట్టామని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ తెలిపారు. గురువారం ఆయన కర్నూలు నగరంలోని సుంకేసుల రోడ్డులో ఉన్న సెయింట్ జోసెఫ్ కళాశాల, నంద్యాల రోడ్డులోని పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, ఆత్మకూరు రోడ్డులోని పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాలలు, పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. అలాగే స్థానికంగా ఏర్పాటు చేసిన వివిధ భద్రత ఏర్పాట్లతో పాటు సిసి కెమెరాల పని తీరును పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన నిబంధనలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలూ, ఇబ్బందులూ కలుగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్, అవాంఛనీయ ఘటనలకు, అక్రమాలకు తావు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో జరగబోతున్న కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాత పరీక్ష కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాశాల యాజామాన్యాలతో చర్చించామని తెలిపారు. ప్రతి కేంద్రం వద్ద అవసరమైన మేరకు పోలీసు సిబ్బందిని నియమించి భద్రత ఏర్పాట్లను ముమ్మరం చేస్తామన్నారు. ఈనెల 22న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కానిస్టేబుల్ ప్రిలిమినరి పరీక్ష ఉంటుందని చెప్పారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా 48 కేంద్రాలు ఉన్నాయన్నారు. కర్నూలు జిల్లాలోనే 22,630 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ఇందులో పురుష అభ్యర్థులు 18,117 మంది, మహిళా అభ్యర్థులు 4,513 మంది ఉన్నారని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద డీఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పర్యవేక్షించనున్నారని తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్లతో పాటు గుర్తింపు కార్డు, బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్నులు మాత్రమే తీసుకు రావాలని చెప్పారు. పరీక్షకు వచ్చే అభ్యర్థులు సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు, ఇతర వస్తువులను హాలులోకి అనుమతించబోమని తెలిపారు. ఆయా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసుకునే విధంగా సంబంధిత పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఎస్పీలు కెవి.మహేష్, యుగంధర్ బాబు, రీజనల్ కో ఆర్డినేటర్ పుల్లారెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస రెడ్డి, కర్నూలు టూ టౌన్ సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ ఖాజావలీ ఉన్నారు.

'కామినేని' ప్రారంభం సంతోషకరం

- ఎంపీ, మేయర్, ఎమ్మెల్యేలు
- కర్నూలులో కామినేని హాస్పిటల్‌ను ప్రారంభించిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

జెమ్ కేర్ కామినేని హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న నగర మేయర్ రామయ్య

హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న కామినేని హాస్పిటల్స్ కొత్తగా కర్నూలు నగరంలో 150 పడకలతో హాస్పిటల్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరమని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ తెలిపారు. గురువారం కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన జెమ్ కేర్ కామినేని హాస్పిటల్‌ను కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్, సీనియర్ నాయకులు మొయిజ్ ఖాన్, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కర్నూలు మేయర్ బివై.రామయ్య ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడారు. జెమ్ కేర్ కామినేని హాస్పిటల్స్ ఇక్కడ నెలకొల్పినట్లు తెలిపారు. వైద్య కళాశాల, దంత వైద్య కళాశాలలూ కామినేని గ్రూపు సారథ్యంలో నడుస్తున్నాయని వివరించారు. అనంతరం యాజమాన్యం మాట్లాడుతూ... దాదాపు 20 రకాల స్పెషాలిటీ విభాగాల్లో చికిత్సలు అందిస్తామని తెలిపారు. కొత్త ఆస్పత్రిలో ప్రత్యేకంగా 75 పడకల కేన్సర్ చికిత్సల విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కామినేని హాస్పిటల్స్ ప్రస్తుతం 3 వేల పడకలకు పైగా సామర్థ్యంతో ఆస్పత్రులను నిర్వహిస్తోందని తెలిపారు. ఉస్మానియా కళాశాల ప్రిన్సిపల్ సమిద్దీన్ పాల్గొన్నారు.

శనగ రైతులను ఆదుకోవాలి

- రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - మద్దికెర

పంట పొలాలను పరిశీలిస్తున్న రామకృష్ణ, వీరశేఖర్

జిల్లావ్యాప్తంగా భారీగా నష్టపోయిన పప్పు శనగ రైతులను ప్రభుత్వం ఆదుకుని రూ.30 వేల నష్టపరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని మద్దికెర, అగ్రహారం, పెరవలి, ఎడవలి గ్రామాల్లో బృందం పర్యటించింది. పొలాల్లో ఉన్న రైతులను దిగుబడి, పెట్టుబడి వివరాలతో పాటు వివిధ సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అకాల వర్షాల వల్ల రైతులు చాలా వరకు పంట నష్టపోయారని తెలిపారు. దిగుబడి చాలా వరకు తగ్గిందని చెప్పారు. మండలంలో దాదాపు 22 వేల ఎకరాల్లో పప్పు శనగ, 9 వేల ఎకరాల్లో పత్తి, 6 వేల ఎకరాల్లో కంది, 3 వేల ఎకరాల్లో ఉల్లి పంటను సాగు చేశారని తెలిపారు. అకాల వర్షాల వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని చెప్పారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన పప్పు శనగ రైతులకు ఎకరాకు రూ.30 వేల పంట నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, రైతు గోపతి పాల్గొన్నారు.

లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్ ప్లాంట్

మార్పు పనులపై శ్రద్ధ పెట్టండి

- రోగులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలి - జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి
- వివిధ విభాగాధిపతులతో ప్రత్యేక సమీక్ష

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్ ప్లాంట్ మార్పు పనులపై ప్రతి హెచ్ఒడి శ్రద్ధ పెట్టాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. గురువారం ప్రభుత్వాస్పత్రిలోని ధన్వంతరి హాలులో వివిధ విభాగాల హెచ్ఒడిలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి మాట్లాడారు. ఆస్పత్రిలోని పలు విభాగాలకు లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్ రీ డిస్ట్రిబ్యూషన్ చేయనున్నట్లు తెలిపారు. లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్ స్విచ్ ఓవర్ కోసం ఎపిఎంఐడిసి చేసిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లను కమిటీ పరిశీలిస్తుందని చెప్పారు. ఆస్పత్రిలోని ఆక్సిజన్ షిఫ్టింగ్ చేసే సమయంలో రోగులకు ఎలాంటి ఇబ్బందీ కలుగకుండా ఆక్సిజన్ మరమ్మతుల కోసం ఎపిఎంఐడిసి స్విచ్ ఓవర్ కోసం సిద్ధమైన తర్వాత వ్యాయామం చేసే సమయం, తేదీ నిర్ణయించనున్నట్లు తెలిపారు. లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్ ప్లాంట్‌ను మార్చడం, ఆక్సిజన్ పైప్‌లైన్‌ల పునఃపంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర రెడ్డి, సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటేశ్వరరావు, వివిధ విభాగాల హెచ్ఒడిల అనస్తీసియా డాక్టర్ కొండారెడ్డి, గైనిక్ డాక్టర్ వెంకటరమణ, మెడికల్ డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ ఎక్బాల్ హుస్సేన్, సర్జరీ డాక్టర్ హరి చరణ్, ఆర్థో డాక్టర్ శ్రీనివాసులు, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నగాంజన్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హాస్టళ్లకు భవనాలు ఏర్పాటు చేయాలి : ఎస్ఎఫ్ఐ

కర్నూలు కార్పొరేషన్ : సాంఘిక సంక్షేమ హాస్టళ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించి నూతన భవనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా డిమాండ్ చేశారు. కర్నూల్ నగరంలోని గుత్తి పెట్రోల్ బంక్ దగ్గర ఉన్న ఎస్సీ సాంఘిక సంక్షేమ హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని గురువారం జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి ఎస్‌పిఎన్.రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ సాంఘిక సంక్షేమ హాస్టల్లో బాత్‌రూములు, టాయిలెట్లు, తాగునీరు, గదులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, టాయిలెట్‌లు క్లీనింగ్ చేయించమని వార్డెన్‌ని హాస్టల్ నుండి తీసేస్తానని బెదిరిస్తున్నారని అన్నారు. దీనిపై తక్షణమే స్పందించి హాస్టల్ వార్డెన్ సుంకన్నపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి సాయి పాల్గొన్నారు.

సామాజిక కవి వేమన

- అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ

పత్తికొండ : సామాజిక కవి యోగి వేమన అని అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం పత్తికొండలోని శాంతి టాలెంట్ స్కూల్‌లో యోగి వేమన జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠ శాల కరస్పాండెంట్ విజయ లక్ష్మి అధ్యక్షత వహించారు. అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు వేమన పద్యాల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాగరాజు, రహంతుల్లా, హమీద్, రంగనాయకులు, ధనలక్ష్మి, విజయ భారతి, రేష్మ, మహబూబి, ఈశ్వరి, భారతి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

యోగి వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ

మెడికవర్‌లో గుండె ప్రొసీజర్స్

- అనతికాలంలోనే 15 వేలకు పైగా నిర్వహణ
- గుండె వ్యాధులపై అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూల్ జిల్లాలో మెడికవర్ హాస్పిటల్స్ స్థాపించిన తక్కువ కాలంలోనే 15000 పైగా గుండె ప్రొసిజర్స్ నిర్వహించి పేషెంట్స్ ప్రాణాలను కాపాడామని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. అనతికాలంలోనే 15000 పైగా గుండె ప్రొసిజర్స్ నిర్వహించిన సందర్భంగా కర్నూలు నగరంలోని మెడికవర్ హాస్పటల్‌లో గుండె వ్యాధులపై అవగాహనా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ చైతన్య కుమార్ మాట్లాడుతూ గుండెపోటును వైద్య పరిభాషలో మయోకార్డియల్ ఇన్ఫార్‌క్షన్ అంటారని, ఇది ఒక సాధారణమైన నాన్-కమ్యూనికేబుల్, దీర్ఘకాలిక వ్యాధి అన్నారు. ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సంక్రమించదని, సమస్య క్రమంగా పెరుగుతూ గుండెకు రక్త సరఫరాను ప్రభావితం చేస్తుందని తెలిపారు. మయోకార్డియల్ ఇన్ఫార్‌క్షన్ అనేది గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ధమనులలో ఒకటి పూర్తిగా పూడుకుపోవడం వల్ల ఎదురయ్యే తీవ్రమైన మెడికల్ ఎమర్జెన్సీ పరిస్థితి అని చెప్పారు. దీనివల్ల గుండెకు ఆక్సిజన్ సరఫరా ఆగిపోయి, ఛాతీ నొప్పి రావడంతో పాటు మయోకార్డియల్ కణజాలం చనిపోతుందన్నారు. డాక్టర్ తేజనంద రెడ్డి మాట్లాడుతూ గుండె ఆరోగ్యంగా ఉందా లేదా అనేది ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలన్నారు. హార్ట్ ఎటాక్, హార్ట్ ఫెయిల్యూర్ వంటి ప్రాణాంతక సమస్యలు వచ్చేముందు శరీరంలో కొన్ని లక్షణాలు కన్పిస్తాయని చెప్పారు. హార్ట్ ఎటాక్‌లో లక్షణాలు ఒళ్లంతా చెమటలు పట్టడం, తల తిరగడం, వాంతుల సెన్సేషన్, ఛాతీలో మంట, వాంతులు, కడుపు నొప్పి వస్తుందని, గురక నిద్ర అనేది ఎప్నియా అనే ఓ వ్యాధి లక్షణమన్నారు. గుండెపై ఒత్తిడి పెరిగితే గురక వస్తుందని, ఇది మంచి అలవాటు కాదన్నారు. సింపుల్‌గా చెప్పాలంటే.. గుండె కండరాలలోని కొన్ని భాగాలకు తగినంత రక్తం లభించనప్పుడు గుండెపోటు వస్తుందని చెప్పారు. దీనికి సకాలంలో చికిత్స చేసి గుండెకు రక్త ప్రవాహాన్ని పునరుద్ధరించాలని తెలిపారు. ఆలస్యం అవుతున్నా కొద్దీ గుండె కండరాలకు ఎక్కువ నష్టం జరుగుతుందని, గుండెపోటుకు ప్రధాన కారణం కొరోనరీ ఆర్టరీ వ్యాధి అని, గుండె కండరాలకు ఆక్సిజన్ ఉండే రక్తం వెళ్లే మార్గం ఒక్కసారిగా సంకోచించడం వల్ల గుండెపోటు రావచ్చన్నారు. క్లస్టర్ హెడ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ అనతికాలంలోనే 15 వేలకు పైగా గుండె సంబంధిత ప్రొసిజర్స్ నిర్వహించి ఎంతో మంది పేషెంట్స్, వారి కుటుంబాలలో వెలుగు నింపడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అత్యాధునిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన డాక్టర్స్, అధునాతన పరికరాలతోటి ఇటువంటివి సాధ్యం అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బిఎస్ ప్రవీణ్ కుమార్, సెంటర్ హెడ్ నీల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15 వేలకు పైగా గుండె ప్రొసీజర్స్ చేసిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మెడికవర్ వైద్యులు

హంద్రీనీవా నుండి చెరువులకు నీటిని అందించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకష్ణ

ప్రజాశక్తి - తుగ్గలి

హంద్రీనీవా నుండి తుగ్గలి మండలంలోని అన్ని చెరువులకు నీటిని అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తుగ్గలిలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుగ్గలి మండలంలోని చెరువులన్నింటికి హంద్రీనీవా ద్వారా నీటిని అందిస్తామని గతంలో పాలకులు చెప్పినా ఇంతవరకు అమలు చేయలేదన్నారు. చెరువులకు నీటిని అందిస్తే పొలాల సాగుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కేవలం వర్షాల మీదే ఆధారపడ్డ రైతులు వర్షాలు సకాలంలో రాకపోతే తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఇక్కడ ఏర్పడుతుందని చెప్పారు. హంద్రీనీవా ద్వారా నీటిని అందిస్తే అటు సాగుకు ఇటు తాగుకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రైతుల పండించిన పంటలకు గిట్టబాటు ధర లేకపోవడంతో కష్టార్జితమంతా నేల పాలవుతుందని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తుగ్గలి మండలంలోని అన్ని చెరువులకు హంద్రీనీవా ద్వారా నీటిని అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ కార్యదర్శి శ్రీరాములు, రైతు సంఘం నాయకులు కొండారెడ్డి, రంగరాజు, సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు రంగ స్వామి, ప్రతాప్, శ్రీనివాసులు, ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జి.రామకృష్ణ

వైసిపి హత్యా రాజకీయాలు మానుకోవాలి

- బిజెపి జిల్లా అధ్యక్షుడు పోలంకి రామస్వామి

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

జిల్లాలో వైసిపి నాయకులు హత్య రాజకీయాలు మానుకోవాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు పోలంకి రామస్వామి పేర్కొన్నారు. వైసిపి నాయకుల హత్యా రాజకీయలకు నిరసనగా నేడు జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్వో కార్యాలయాల ముందు ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. గురువారం స్థానిక బిజెపి కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాలింగి నరసింహ వర్మ, జిల్లా నాయకులు చంద్ర శేఖర్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆలూరు నియోజకవర్గంలో వైసిపి నాయకులను ప్రశ్నించినందుకు దాడులు చేశారని, వెల్దుర్తిలోనూ తమ కార్యకర్తపై ఎమ్మెల్యే అనుచరులు దాడి చేశారన్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో బిజెపి కార్యకర్తను హత్య చేశారన్నారు. పాలన చేయాల్సిన వారు హత్యలు చేస్తూ రోడ్లు, మౌలిక సదుపాయాలు చేయలేదని అడిగితే దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. పోలీసు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. పోలీస్‌లు అధికారులా లేక వైసిపి కార్యకర్తలా అని ప్రశ్నించారు. జిల్లాలో ఇప్పటిదాకా ఒక్క పెండింగ్ ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న 14 సంక్షేమ పథకాల అభివృద్ధి కార్యక్రమాలపై ఈ నెల 22, 23, 24న కేంద్ర ఐటి శాఖామంత్రి చౌహాన్ కోడుమూరు, కర్నూలు నియోజకవర్గంలో పర్యటిస్తారని తెలిపారు. ఇప్పటి నుండి ప్రతి నెలా 3 రోజులపాటు కేంద్ర మంత్రి పర్యటనలు ఉంటాయన్నారు. వచ్చే నెలలో కేంద్ర హోమ్ శాఖామంత్రి పర్యటన కూడా ఖరారు అవుతుందని తెలిపారు.

మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు పోలంకి రామస్వామి

సన్మానిస్తున్న దృశ్యం

హనుమంతరావు చౌదరికి ఉత్తమ కళాసేవ అవార్డు

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

రవీంద్ర భారతిలో తెలంగాణ రాష్ట్ర తెలుగు భాష సాంస్కృతిక శాఖ, శ్రీ రాగ రమ్య కల్చరల్, సోషల్ యాక్టివిటీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హనుమంతరావు చౌదరిని కళాసేవా పురస్కారంతో సత్కరించారు. సమాచార శాఖ మాజీ కమిషనర్ దిలీప్ రెడ్డి, హాస్య బ్రహ్మ శంకర నారాయణ తదితరుల చేతులమీదుగా ఈ అవార్డు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర తెలుగు భాష సాంస్కృతిక శాఖ, శ్రీ రాగ రమ్య కల్చరల్, సోషల్ యాక్టివిటీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 'కళా హేమంతం' 4వ వార్షికోత్సవ వేడుకలు హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగాయి. రెండు తెలుగు రాష్ట్రాల కళాకారులు పాల్గొన్న ఈ సభలో హనుమాన్ కళా సమితి వ్యవస్థాక అధ్యక్షుడు హనుమంతరావు చౌదరి దుర్యోధన పాత్ర డైలాగులతో అలరింపచేశారు. ప్రముఖ మిమిక్రీ, వెంట్రి లాక్విజం కళాకారుడు రాజ్ కుమార్ వెంట్రిలాక్విజం ప్రదర్శించి నవ్వించారు. మహిళా కళాకారులు వీణ, తబల, పిల్లనగ్రోవి ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. హనుమంతరావు చౌదరి, లక్ష్మి పద్మ దంపతులను సమాచార శాఖ మాజీ కమిషనర్ దిలీప్ రెడ్డి, హాస్య బ్రహ్మ శంకర నారాయణ శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ, హైందవ ధర్మ రక్షక్ దళ్ నేషనల్ చైర్మన్ డాక్టర్ యజ్ఞం పవన్ కుమార్ శర్మ, ప్రముఖ మహిళా నాయకురాలు, సామాజికవేత్త రజని శర్మ, జిహెచ్ఆర్ఎ చైర్మన్ డాక్టర్ బాబు మిరియం, ఆధ్యాత్మిక గురువులు నారాయణ చక్రవర్తులు, హెచ్ యండిఏ ఓయస్డీ షేక్ మీరా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

వరికోత యంత్రం అదుపు తప్పి కూలీ మృతి

ప్రజాశక్తి - సి బెళగల్

మండలంలోని మారందొడ్డిలో వరికోత యంత్రం అదుపుతప్పి సుభాష్ (28) వ్యవసాయ కూలీ గురువారం అక్కడికక్కడే మృతి చెందారు. గ్రామానికి చెందిన పంచర్ వలి వరి కోత యంత్రం ఓ రైతు వరి పంటలో కోత అయ్యాక మరొక రైతుకు వెళ్లే క్రమంలో వరికోత యంత్రం పొలం గట్లపై అదుపు తప్పి పదిమందిపై పడసాగింది. అందరు తప్పించుకోగా సుభాష్ వెళ్లలేకపోవడంతో మీద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. రంజిత్ కుమార్ చేయి విరిగి గాయాలపాలయ్యాడు. సుభాష్‌కు అఖిలతో ఐదేళ్ల క్రితం వివాహం అయ్యింది. ఒక కుమారుడు. భార్య ప్రస్తుతం నిండు గర్భిణీ కావడం, భర్త సుభాష్ అకాల మరణంతో కుటుంబంలో విషాదం నెలకొంది.

ప్రతి వార్డులోనూ డ్రెయినేజీ, సిమెంట్ రోడ్డు

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణంలోని ప్రతి వార్డులోనూ డ్రెయినేజీ, సిమెంట్ రోడ్ల ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని మూడో వార్డులో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ప్రతి గడపకూ తిరుగుతూ వార్డులో సమస్యలు తెలుసుకుంటూ పథకాలు అందలేదో వారందరికీ పథకాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడారు. 'గడపగడపకు'లో తెలుసుకున్న సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు. అవసరం మేరకు ప్రతి వార్డుకు రూ.20 లక్షల వ్యయంతో డ్రెయినేజీ, సిమెంట్ రోడ్లకు ప్రతిపాదనలు పంపి నిధులు మంజూరు చేయిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక టిడిపి నాయకులు ప్రతిపక్షాలను కలుపుకొని ప్రజల హృదయాల నుంచి దూరం చేయాలని కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. ఎన్ని కుట్రలు పన్నినా ప్రజల ఆశీస్సుతో 2024లో కూడా అధికారం చేపడతామని ధీమా వ్యక్తం చేశారు. వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ మధుసూదన్, మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, డైరెక్టర్లు మంజుల, రేణుక, మురళీ రెడ్డి, కామాక్షి తిమ్మప్ప, సలీం, మస్తాన్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, వైసిపి పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, అధ్యక్షులు దేవా, నాయకులు కిషోర్ ఉన్నారు.

వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రతి ఇంటా సంక్షేమ సంతోషం

- వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంక్షేమ సంతోషం నెలకొందని వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని 9, 10వ వార్డు సచివాలయాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. గడపగడపకు తిరిగి ఆయా ఇళ్లలో లబ్ధిదారులు పొందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్ లెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని తెలిపారు. ఆ దిశగా ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నారని చెప్పారు. అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. వార్డులో రోడ్డు సమస్యను కాలనీవాసులు విన్నవించారు. ఆయన మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి రోడ్డు వేయాలని ఆదేశించారు. పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా ఉండేందుకు ఐఎబి స్కీం కింద రూ.144 కోట్లతో జిడిపి నుంచి నీటిని పంపింగ్ చేసేందుకు నిర్మాణ పనులను వేగవంతం చేసేలా ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. వార్డు కౌన్సిలర్లు రాజా రత్నం, సుధాకర్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ డి.నజీర్ అహ్మద్, కమిషనర్ ఎన్.గంగిరెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షులు రియాజ్ అహ్మద్, వైసిపి పట్టణ అధ్యక్షులు బుట్టా రంగయ్య, కోశాధికారి తారా రాజశేఖర్, టౌన్ బ్యాంక్ ఛైర్మన్ యూకె.రాజశేఖర్, కో ఆపరేటివ్ స్టోర్ ఛైర్మన్ షబ్బీర్ అహ్మద్, పట్టణ కన్వీనర్ బంగి శ్రీరాములు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి

పార్టీ బలోపేతంపై ప్రజల్లో చైతన్యం తేవాలి

- జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ లక్ష్మన్న

ప్రజాశక్తి - మంత్రాలయం

జనసేన పార్టీ బలోపేతంపై పల్లె ప్రజల్లో చైతన్యం తేవాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బి.లక్ష్మన్న కార్యకర్తలను కోరారు. గురువారం రాఘవేంద్ర నగర్ కాలనీలోని స్వగృహంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలను చైతన్య పరిచేందుకు పల్లెల్లో పర్యటిస్తామని తెలిపారు. అనుకూల పార్టీల పొత్తు ఉన్నా జనసేన పార్టీ నియోజకవర్గ అభ్యర్థిగా తనకు అవకాశం ఇస్తామని పవన్ కల్యాణ్ చెప్పారని పేర్కొన్నారు. జనసేన క్రియాశీలక పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5 లక్షల బీమా సౌకర్యం ఉంటుందని, ప్రమాదం జరిగితే రూ.50 వేలు ఆస్పత్రి ఖర్చులకు ఇస్తారని తెలిపారు. అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు జనసేన పార్టీ నుంచి ఒక్కొక్కరికి రూ.లక్ష అందజేసిన ఘనత పవన్ కల్యాణ్‌దేనని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి ఊరు తిరిగి పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని తెలిపారు. బిబిసి చిన్న, బివి.రవిచంద్ర, రాము, అమీర్, ఉసేని, నవీన్, అంజి, వినయ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జీ లక్ష్మన్న

భ్రూణ హత్యలను నివారిద్దాం

- లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాలను ఉపేక్షించొద్దు
- ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

భ్రూణ హత్యలను సంపూర్ణంగా నివారిద్దామని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీఎస్పీ వినోద్ కుమార్, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ సత్యవతిలతో కలిసి డివిజన్ స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు, పిసిపిఎన్‌డిటి చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ.50 వేల జరిమానా నుంచి 3 ఏళ్ల వరకు జైలు శిక్ష వర్తించేలా కేసు నమోదు చేయాలని చెప్పారు. ఆదోని డివిజన్ పరిధిలో 39 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. సమాజంలో లింగ అసమానతలకు కారణమవుతున్న భ్రూణ హత్యలను సంపూర్ణంగా నివారించేందుకు కృషి చేయాలని చెప్పారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ పిసిపిఎన్‌డిటి చట్టాన్ని ఉల్లంఘిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. తల్లిదండ్రుల ఆలోచన విధానంలో మార్పులు తీసుకురావడం ద్వారానే భ్రూణ హత్యలను నివారించగలమని తెలిపారు. రానున్న రోజుల్లో గర్భస్త శిశువులపై లింగ వివక్షకు వ్యతిరేకంగా, పిసిపిఎన్‌డిటి చట్టంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాలపై సమాచారం అందించిన వారికి నగదు బహుమతి అందిస్తామన్నారు. పిసిపిఎన్‌డిటి చట్టం ప్రకారం స్కానింగ్ కేంద్రాలపై కచ్చితమైన సమాచారం అందించిన వారికి రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకూ బహుమతి అందించే అవకాశం ఉందన్నారు. ఆదోని డివిజన్ పరిధిలో ఉన్న స్కానింగ్ కేంద్రాలను ప్రతి మూడు నెలలకోసారి తనిఖీ చేసి నూతన రిజిస్ట్రేషన్లు, రెన్యువల్, సిబ్బంది, చిరునామా, పరికరాల్లో మార్పులు వంటి అంశాలపై తనిఖీ చేసి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్కానింగ్ సెంటర్ల అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న, గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవి లత, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీనియర్ సహాయకులు సంగీత, టూ టౌన్ సిఐ శ్రీనివాస్ నాయక్, డిస్ట్రిక్ట్ మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

గర్భిణులకు చికిత్సలు నిర్వహిస్తున్న 104 సిబ్బంది

104 సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- డాక్టర్ పార్వతి

ప్రజాశక్తి - చిప్పగిరి

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ పార్వతి తెలిపారు. ప్రభుత్వం నూతనంగా 'ఫ్యామిలీ డాక్టర్' అనే పథకం పేరుతో ప్రజల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందని చెప్పారు. గురువారం మండలంలోని బండనాల గ్రామంలో 104 సేవలను చిప్పగిరి డాక్టర్ పార్వతి నిర్వహించి, ప్రజలు, గర్భిణుల ఆరోగ్యాన్ని పరిశీలించారు. గ్రామంలో గర్భిణులకు డాక్టర్ పార్వతి బీపీ, షుగర్ పరీక్షించి, ఐరన్, కాల్షియం మాత్రలను అందజేశారు. గర్భిణులు కాన్పుల సమయంలో రక్తహీనతతో బాధపడకుండా వారికి అన్ని విధాల సేవలు అందించేందుకు 104 ఏర్పాటు చేసి ప్రతి గ్రామానికీ తిరిగి చికిత్సలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. గ్రామ వైఎస్ఆర్ క్లినిక్ ఇన్‌ఛార్జీ సతీష్ నాయక్, ఎఎన్ఎం పార్వతి, ఆశా వర్కర్ సంధ్య పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని తిప్పనూరు గ్రామంలో సంక్రాంతి సందర్భంగా మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డి స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ పోటీల విజేతలకు టిడిపి నాయకులు గురువారం బహుమతులను అందజేశారు. ఐదు రోజులపాటు సాగిన ఈ టోర్నమెంట్‌లో 20 జట్లు పాల్గొన్నాయి. గువ్వలదొడ్డి జట్టు విజేతగా నిలిచి మొదటి బహుమతి రూ.10 వేలు సొంతం చేసుకరుంది. రన్నర్‌గా తిప్పనూరు జట్టు నిలిచి రూ.5 వేల నగదు అందుకుంది. టిడిపి మండల కన్వీనర్ నజీర్ సాహెబ్, ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య నాయుడు, సోషల్ మీడియా కన్వీనర్ రాంపురం రఫీక్, టిడిపి తిప్పనూరు నాయకులు రామకృష్ణ, ఏలియా, రాఘవేంద్ర నాయుడు, కౌలుట్లయ్య, హనుమంతు, జయరాముడు, హనుమంతు, దస్తగిరి, మద్దిలేటి పాల్గొన్నారు.

నగదు బహుమతి అందజేస్తున్న టిడిపి నాయకులు

చిరుధాన్యాల్లో విలువల జోడింపుపై శిక్షణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మండలంలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో 'చిరుధాన్యాల్లో విలువల జోడింపు' అంశంపై గురువారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ పి.అపర్ణ మాట్లాడారు. చిరుధాన్యాల్లో పోషక విలువలు జోడించి వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేసుకొనే విధానం గురించి వివరించారు. మహిళలు, పిల్లలు తీసుకోవాల్సిన పోషకాహారం గురించి తెలిపారు. కార్యక్రమ సమన్వయ కర్త, కృషి విజ్ఞాన కేంద్రం డాక్టర్ పి.సుజాతమ్మ, ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, జెపి.స్వామి, వీరేష్, కరుణ పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

కూలీలు ఉపాధి పనులకు రావాలి

- వైసిపి మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి

కూలీలతో మాట్లాడుతున్న ఉపాధి అధికారులు, నాయకులు

ప్రజాశక్తి - కౌతాళం

గ్రామాల్లోని ప్రజలు ఉపాధి హామీ చట్టం కింద ఉపాధి పనులకు రావాలని, వలసలు వెళ్లరాదని వైసిపి మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, సర్పంచి పాల్ దినకరన్ తెలిపారు. గురువారం ఎపిఒ జుబేర్, ఖాదర్ బాషా కూలీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వలసల నివారణ కోసమే ప్రభుత్వం ఉపాధి పనులు కల్పించిందని తెలిపారు. సొంత గ్రామాల్లోనే ఉండి పనులు చేసుకోవాలని కోరారు. సుదూర ప్రాంతాలకు వలస వెళ్లి ఇబ్బందులు పడరాదన్నారు. కూలీలకు ఉపాధి హామీ చట్టం కింద పనులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

వేమన చిత్రపటానికి పూలమాలలతో నివాళు లర్పిస్తున్న గ్రంథాలయ అధికారి అబ్దుల్ రసూల్

వేమన పద్యాల సారాంశం యువతకు ఆదర్శం

- గ్రంథాలయ అధికారి అబ్దుల్ రసూల్

ప్రజాశక్తి - చిప్పగిరి

నేటి సమాజంలో యోగి వేమన శతక, పద్యాలు మరువలేనివని మండల గ్రంథాలయ అధికారి అబ్దుల్ రసూల్ తెలిపారు. గురువారం చిప్పగిరిలో ఉన్న గ్రంథాలయంలో యోగి వేమన జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆధునిక కాలంలో కూడా వేమన రచించిన పద్యాలను ప్రతి ఒక్కరూ ఇష్టపడుతున్నారని తెలిపారు. వేమన పద్యాల్లో సారాంశం యువతకు మంచి సందేశాన్ని అందిస్తోందని చెప్పారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి

- ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి రమేష్

ప్రజాశక్తి - ఆస్పరి

ఆంధ్రప్రదేశ్ విభజన హామీల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఈనెల 20న హిందూపురం నుంచి ఇచ్ఛాపురం (ఫిబ్రవరి 4) వరకు విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరారు. గురువారం కైరుప్పలలో సిపిఐ బండమీది వెంకటేశ్వర్లు భవనంలో ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బస్సు యాత్రలో ఆస్పరి మండలం నుంచి విద్యార్థులు, నిరుద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. విశాఖ ఉక్కును ప్రయివేటీకరణను నిలిపేసి, విశాఖను రైల్వే జోన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతపురంలో సెంట్రల్ యూనివర్సిటీకి నిధులు కేటాయించాలని, వైద్య, విద్య సంస్థలు ఏర్పాటు చేయాలని కోరారు. నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ నాయకులు సురేష్, రేవన్, గోపి, వీరాంజనేయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి రమేష్

శ్రీమఠంలో ఘనంగా ద్వాదశీ పూజలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ద్వాదశీ పూజలను ఘనంగా నిర్వహించారు. గురువారం ద్వాదశీ తిథి సందర్భంగా శ్రీమఠం పూజా మందిరంలో స్వర్ణ పీఠంపై మూల రాములు, జయరాములు, దిగ్విజయరాముల మూర్తులను ఉంచి క్షీరాభిషేకంతో పాటు పుష్పార్చనతో అర్చించి మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం విగ్రహ మూర్తులను భక్తులకు చూపిస్తూ ప్రత్యేకతను వివరించారు. అనంతరం భక్తులకు పీఠాధిపతులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

స్వర్ణమయమైన రాఘవేంద్రుని మూలబృందావనం : శ్రీమఠంలో రాఘవేంద్రుని మూల బృందావనం స్వర్ణమయమై భక్తులకు దర్శనమిచ్చారు. రాఘవేంద్రస్వామి బృందావనాన్ని పూజారులు నిర్మాల్యం చేసి తులసి అర్చన, పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు నిర్వహించారు. బృందావనాన్ని స్వర్ణకవచాలతో, పట్టు వస్త్రాలతో, వివిధ పుష్ప హారాలతో అలంకరించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాఘవేంద్రుని ఆరాధ్య దైవమైన మూల రాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాఘవేంద్రస్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం : శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో భక్తుల కోలాహలం నెలకొంది. రాఘవేంద్రుని దర్శనార్థమై దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మంత్రాలయం చేరుకున్నారు. భక్తులు తుంగభద్ర నదిలో స్నానాలు చేసి గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థులు భక్తులకు ఫల మంత్రాక్షితలు అందజేశారు. ద్వాదశీ తిథి సందర్భంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అన్నపూర్ణ భోజనశాలలో భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు.

భక్తులకు ఫలమంత్రాక్షితలు అందజేస్తున్న పీఠాధిపతులు

ఆధార్ క్యాంపును పరిశీలిస్తున్న అధికారులు

ఆధార్ ప్రత్యేక క్యాంపు

- ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ సుధాకర్ రాజు, ఇఒఆర్‌డి సంజన్న

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని గ్రామాల్లో నిర్వహించే ఆధార్ ప్రత్యేక క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ సుధాకర్ రాజు, ఇఒఆర్‌డి సంజన్న తెలిపారు. చిప్పగిరి సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి నాగభూషణం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఆధార్ ప్రత్యేక క్యాంపును మండల అధికారులు ప్రారంభించారు. వారు మాట్లాడారు. చిప్పగిరిలో ఈనెల 20, 21న ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల సచివాలయ కేంద్రాల్లో ఆధార్ క్యాంపు నిర్వహిస్తామన్నారు. డిజిటల్ అసిస్టెంట్ పవన్, రెవెన్యూ కార్యదర్శి వీరన్న పాల్గొన్నారు.

పోటీ పరీక్షలతో నాణ్యత ప్రమాణాలు పెంపు

- భీమా కళాశాల సెక్రటరీ విష్ణువర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో విద్య నాణ్యత ప్రమాణాలు పెంపొందుతాయని భీమా కళాశాల సెక్రటరీ విష్ణువర్ధన్ రెడ్డి, ప్రిన్సిపల్ జిఎస్.సురేంద్రబాబు తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో వారు మాట్లాడారు. తమ కళాశాలకు చెందిన డిప్లొమా విద్యార్థి గురు ప్రసాద్ వివేకానంద సంస్థ ఆధ్వర్యంలో నెహ్రూ మెమోరియల్ స్కూలులో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలవడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థీ పోటీ పరీక్షలను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. విజేతగా నిలిచిన విద్యార్థి గురు ప్రసాద్‌ను, తర్ఫీదు ఇచ్చిన అధ్యాపకులను వారు అభినందించారు.

ప్రశంసాపత్రం పంపిణీ చేస్తున్న విష్ణువర్ధన్ రెడ్డి

హెల్మెట్ తప్పనిసరి

- ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్
- 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు

ప్రజాశక్తి - ఆదోని

వాహనాలను నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. గురువారం పట్టణంలోని ఆర్‌టిఒ కార్యాలయం వద్ద 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు నిర్వహించారు. రహదారి భద్రత వారోత్సవాల గోడపత్రికలను విడుదల చేశారు. సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ హాజరయి మాట్లాడారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని సూచించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని, సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని తెలిపారు. డ్రైవింగ్ చేసేటప్పుడు మనకు ఏదైనా జరగరానిది జరిగితే కుటుంబాన్ని ఆదుకోవడానికి ఎవరూ ఉండరని చెప్పారు. డ్రైవింగ్ చేసేటప్పుడు ప్రశాంతంగా ఉండాలని, అనేక విషయాలను డ్రైవర్లకు సూచించారు. తరచూ తనిఖీలు నిర్వహిస్తూ వాహనదారులను చైతన్య పరుస్తున్నామని రోడ్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ శివారెడ్డి తెలిపారు. వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిర దీప్తి, సుధాకర్ రెడ్డి ఉన్నారు.

డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆదోని బ్రాంచి ఆధ్వర్యంలో రహదారి భద్రత దినోత్సవాల సందర్భంగా ఆదోని ఆర్‌టిఒ కార్యాలయం వద్ద ఆటో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ పద్మ కుమార్, డాక్టర్ శ్రీపతి పాల్గొన్నారు.

గోడపత్రికను విడుదల చేస్తున్న అధికారులు

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

- నూతన రైతు లోకం మాస పత్రిక, రైతు డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆస్పరి

రైతాంగ సమస్యల పరిష్కారానికి రైతు సంఘం నిరంతరం కృషి చేస్తోందని సింగిల్ విండో ఛైర్మన్ గోవర్ధన్, సిఐఒ అశోక్, ఎపి రైతు సంఘం తాలూకా అధ్యక్షులు నాగేంద్రయ్య తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ రూపొందించిన నూతన రైతు లోకం మాస పత్రిక, రైతు డైరీని సొసైటీ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వ్యవసాయంలో సాంకేతిక విషయాలను రైతులకు అందిస్తూ రైతు లోకం వ్యవసాయ మాస పత్రిక ద్వారా రైతు సంఘం చేస్తున్న కృషి రైతులకు ఉపయోగకరమని చెప్పారు. పంటలకు సంబంధించి విత్తనాలు, ఎరువులకు కచ్చితమైన సమాచారం మాసపత్రిక, రైతన్న డైరీలో ఉంటుందని తెలిపారు. ప్రతి రైతూ మాసపత్రికను, రైతన్న డైరీని తీసుకోవాలని కోరారు. సిపిఐ పట్టణ కార్యదర్శి కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు బ్రహ్మయ్య, ఉరుకుందప్ప, వైసిపి నాయకులు శంకర్, ఎపి రైతుసంఘం నాయకులు రామాంజినేయులు, రంగస్వామి, చంద్రశేఖర్, మోటో పాల్గొన్నారు.

మాస పత్రిక, రైతు డైరీని ఆవిష్కరిస్తున్న ఛైర్మన్ గోవర్ధన్

మా బతుకులు రహదారి పాలు...

- తప్పుల తడకగా ఆదోని బైపాస్ భూసేకరణ
- గెజిట్‌లో ప్రభుత్వ భూములుగా ముద్రణ
- 50 కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరం

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని బైపాస్ నిర్మాణం కోసం సేకరించిన భూముల వివరాలు తప్పుల తడకగా మారాయని, ప్రయివేట్ భూములను ప్రభుత్వ భూములుగా చూపించి నష్టపరిహారం అందకుండా స్థానిక నాయకులు కుట్రలు పన్నుతున్నారని బాధితులు వాపోయారు. గురువారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని కల్లుబావి పరిధిలోని 414, 411వ సర్వే నెంబర్‌లోని భూములు గతంలో కర్ణాటక రాష్ట్రం హంపి విరుపాక్షి స్వామి దేవస్థానం అధికారులు బహిరంగ వేలం వేశారని తెలిపారు. 411వ సర్వే నెంబర్‌కు ఓ రాజకీయ నాయకునికి రాజకీయ పలుకుబడితో ఎండోమెంట్ అధికారులు ఎన్ఒసి (నో అబ్జెక్షన్ సర్టిఫికెట్) ఇచ్చారని చెప్పారు. సర్వే నెంబర్ 414కు మాత్రం అధికారులు ఇవ్వలేదన్నారు. ఇందులో సుమారు 50 కుంటుబాలు భూములను కొనుగోలు చేశాయని తెలిపారు. 2008 నుంచి ప్రభుత్వం నిషేధిత జాబితాలో ఉంచి పేదలను ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి సర్వే నెంబర్లను నిషేధిత జాబితా నుంచి తొలగించి నష్టపరిహారాన్ని తమకు అందేలా చర్యలు తీసుకోవాలని బాధితులు అబ్దుల్ రషీద్, సయ్యద్ అజ్మత్ పీర్, ఎక్బాల్, ఇషా, షఫీజి, అక్బర్, మజహర్ కోరారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తున్న బాధితులు

సమావేశంలో ఎపిజిబి మేనేయర్ జగదీశ్వర్‌రెడ్డి

రుణాలు సకాలంలో చెల్లించాలి

- ఎపిజిబి మేనేజర్ జగదీశ్వర్‌రెడ్డి
- ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - హాలహర్వి

బ్యాంకులో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ జి.జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు వారి ఆధ్వర్యంలో హాలహర్వి బ్రాంచి నిట్రవట్టి గ్రామంలో 'ఆర్థిక అక్షరాస్యత'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ బ్యాంకు డిపాజిట్లు చేసుకోవాలని, ప్రధానమంత్రి జన్‌ధన్ బీమా యోజన పథకాలు, నగదు రహిత లావాదేవీలు, రూపే కార్డును వినియోగించాలని తెలిపారు. బ్యాంకులో హౌసింగ్ లోన్, ట్రాక్టర్ల లోన్, బంగారుపై రుణాలు, ఎస్‌హెచ్‌జి లోన్స్, క్రాప్ లోన్ పొంది సకాలంలో చెల్లించాలని కోరారు. కెఎస్ రూరల్ మీడియా కళాసంస్థ రమణ, శశి కళా జాతా టీమ్ పాటలు, మాటల ద్వారా, మ్యాజిక్ రూపంలో ప్రజలకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు. అసిస్టెంట్ మేనేజర్ జి.అనిల్, గాదిలింగప్ప పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడును కలిసిన నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

మంగళ గిరిలోని టిడిపి జాతీయ పార్టీ కార్యాలయంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడును కలిసి రాజకీయ పరిస్థితులను వివరించామని టిడిపి సీనియర్ నాయకులు గురువారం తెలిపారు. టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ, ఫుడ్ కమిషన్ మాజీ సభ్యులు గుడిసె కృష్ణమ్మ, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మదిరే భాస్కర్ రెడ్డి, మాన్వి దేవేంద్రప్ప, టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, ఎల్ఎల్‌సి మాజీ ఛైర్మన్ రామస్వామి, మైనారిటీ నాయకులు సౌదీ రావూఫ్, ఆత్మ మాజీ ఛైర్మన్ ఫక్రుద్దీన్, కౌన్సిలర్ రామచంద్ర కలిశారు. ఆదోని పరిస్థితులపై, ఆదోని నియోజకవర్గ సమస్యలు అడిగి తెలుసుకున్నారన్నారు. తమకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరామన్నారు.

మహారాజ శ్రీ కర్నూలు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S NO. 143 / 2020

S.నూర్ అహ్మద్. ...వాది
-Vs-
S.మాసుమ్ వలి. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

S.మాసుమ్ వలి తండ్రి S. సర్దార్ మియా, వ్యాపారం, ఇంటి నం.49-50A-87-16-1A, లక్ష్మీనగర్, కర్నూలు.

పై నంబరు దావాలో వాది ప్రతివాది నుండి దావా మొత్తము రూ. 1,24,050/- లు, ఇందుపైన ముందు వడ్డీ మరియు కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 30-1-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 30-1-2023

K.రామక్రిష్ణ,
J.దేవేంద్ర,
వాది పరం న్యాయవాదులు,
కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి గారి కోర్టులో
I.A NO.556/ 2022 in I.A No.500/ 2020,
A.S.NO./ 2020 in C.F.R No.2741 / 2020

శీమతి. జైతూన్ బీ పోతివారసులు
అప్సర్ హుస్సేన్ వగైరా. ...అప్పీలెంట్లు/అర్జీదారులు
-Vs-
A.నాగన్న పోతివారసులు
5నుంచి 10 రెస్పాండెంట్లు వగైరా. ...రెస్పాండెంట్లు

9,10, రెస్పాండెంట్లకు ఆర్డర్ 22 రూలు 4 C.P.C మరియు రూలు 28 C.R.P ప్రకారం నోటీసులు

9.కంటి.లక్ష్మమ్మ తండ్రి A.నాగన్న
10.ఈశ్వరమ్మ తండ్రి A.నాగన్న,
ఇద్దరు ఇంటి నెం. 38/107, మించిన్ బజార్, కర్నూలు.

పై నంబరు I.A లో అర్జీదార్లు (అప్పీలెంట్లు) 1వ రెస్పాండెంటు అయిన A.నాగన్న చనిపోయినందున అతనికి వారసులు చేర్చమని అర్జీదారు అర్జీ దాఖలు చేసినారు. ఇందులో 9,10 రెస్పాండెంట్లు అయిన మీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 24-1-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 24-1-2023

S.ఇదురు బాషా,
S.MD.అఫ్రోజ్
అర్జీదార్లు (అప్పీలెంట్లు) పరం న్యాయవాదులు,
కర్నూలు.